www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 19 డిసెంబర్ 2025
5
తూర్పుగోదావరి



కందుకూరి విద్యాసంస్థలను పరిరక్షించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కందుకూరి విద్యాసంస్థలను పరిరక్షించాలని, విటి కళాశాలను ప్రభుత్వంలో విలీనం చేయాలని దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కందుకూరి విద్యాసంస్థలను పరిరక్షించాలని, కందుకూరి ఆశయాలను కాపాడాలని మంత్రి నారా లోకేష్‌ను కోరుతున్నామన్నారు. ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగా జిఒ 42 ప్రకారం కందుకూరి విద్యాసంస్థలు ప్రభుత్వ పరమయ్యాయన్నారు. అయితే నాలుగు విద్యాసంస్థలు మాత్రమే ప్రభుత్వంలో విలీనం అయ్యాయన్నారు. విటి జూనియర్ కళాశాల (ప్రొవిడింగ్స్) ఆలస్యం కావడతో ప్రభుత్వంలో విలీనం కాలేదన్నారు. తక్షణమే దీన్ని ప్రభుత్వంలో విలీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు

ఎల్ఐసిలో 100 శాతం ఎఫ్‌డిఐలపై నిరసన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

బీమా రంగంలో వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పెంపును నిరసిస్తూ బీమా ఉద్యోగులు గురువారం భోజన విరామసమయంలో నిరసన ప్రదర్శన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్, నాయకులు మాథ్యూస్, వీరకిషోర్, పద్మావతి మాట్లాడారు. విదేశీ భాగస్వామ్యంతో కూడిన పెద్ద సంఖ్యలో ప్రైవేట్ బీమా కంపెనీలు జీవిత, సాధారణ బీమా రంగాల్లో పని చేస్తున్నాయన్నారు. ఈ కంపెనీలను తమ వ్యాపారాలను నడపడానికి మూలధనం ఎప్పుడూ ఆటంకం కాలేదన్నారు. బీమా రంగంలో మొత్తం ఎఫ్‌డిఐ, వినియోగించిన మూలధనంలో కేవలం 32 శాతంగానే ఉందన్నారు. పరిస్థితి ఇలా ఉండగా, ప్రభుత్వం ఎఫ్‌డిఐ పరిమితిని 100శాతానికి పెంచి, భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహించడానికి విదేశీ మూలధనానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం సహేతుకం కాదన్నారు. ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థపై మాత్రమే కాకుండా భారతీయ బీమా కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఇప్పటికే ఉన్న కంపెనీలను స్వాధీనం చేసుకోవడానికి బిడ్లు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. విదేశీ మూలధనానికి పూర్తి స్వేచ్ఛ, అధిక ప్రాప్యతను అనుమతించడం వల్ల



నిరసన తెలుపుతున్న ఎల్ఐసి సిబ్బంది

బీమా పరిశ్రమ వృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. దేశంలో అణగారిన వర్గాల ప్రయోజనాలపై వినాశకరమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు. అంతేకాకుండా, విదేశీ మూలధనం దేశీయ పొదుపులకు ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్ణయం ఎమర్జెన సమంజసం కాదన్నారు. భారతదేశం ఒక సంక్షేమ రాజ్యంగా ఉన్నందున, తన పౌరులందరికి ప్రయోజనం చేకూర్చే ఆర్థిక అభివృద్ధి కోసం పొదుపులపై తప్పనిసరిగా అధికంగా ప్రభుత్వ నియంత్రణ ఉండాలన్నారు.

బీమా కంపెనీలను బీమాయేతర కంపెనీలతో విలీనం చేయడానికి అనుమతించడం, పార్లమెంటరీ పర్యవేక్షణ నుంచి దూరంగా ఉంటూ ఐఆర్‌డిఎఐకి విస్తృత అధికారాలు కల్పించడం, మధ్యవర్తులకు ఒకేసారి రిజిస్ట్రేషన్, విదేశీ పునర్బీమా సంస్థలకు నికర యాజమాన్య నిధుల పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.5వేల కోట్ల నుంచి రూ.1,000 కోట్లకు తగ్గించడం వంటి సవరణలు దేశాన్ని 1956 పూర్వపు పరిస్థితికి తీసుకువెళ్తాయన్నారు. ప్రైవేటు రంగంలోనివీన బీమా సంస్థలు ప్రజల సొమ్మును సరైన భద్రత ఇవ్వకపోవడంతో బీమా ఉద్యోగుల నిధుల ప్రభుత్వం జాతీయం చేసిందని గుర్తు చేశారు. నేడు కేంద్ర ప్రభుత్వం తన ఆర్థిక విధానాలను కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా మార్చడం సరియైన విధానం కాదన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. బీమారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పెంపు, మరియు బీమా చట్టాల సవరణ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు బీమా ఉద్యోగుల ఐక్య ఫ్రంట్ నాయకులు స్పష్టం చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో ఎల్ఐసి అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు, రేఖ, పుష్పకుమారి, శరణ్య, శ్రీదేవి, శిరీష, రామలక్ష్మి, ప్రమద్వర, భానుమతి, సునీత,మరియు నాయకులు షఫీ, ఈశ్వర రావు, సత్యదేవ, పిఎస్ఎన్ రాజు, జి.శ్రీనివాస్, ఇమ్రాన్, బి.శ్రీనివాస్, రమేష్‌బాబు, జిలానీ, సాయిబాబా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా శిబిరంలో ఉపాధ్యాయులు

టెట్‌పై యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

సీనియర్ ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుంచి మినహాయించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం బొమ్మూరు కలెక్టరేట్ వద్ద ధర్నా, నిరసన దీక్ష జరిగింది. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాల ఉపాధ్యాయులకు సెలవుల సమస్యను పరిష్కరించాలన్నారు. పదో తరగతి 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ఆదివారాలు, సెలవులు మినహాయించాలన్నారు. 2025 బదిలీలలో రిలీవ్ కాని వారిని రిలీవ్ చేయాలన్నారు. ఆర్థిక బకాయిలను చెల్లించాలని, జిఒ 57 ప్రకారం 2003 డిఎస్‌సి వారికి వెంటనే నూతన పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌ఒ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు విజయగౌరి, ఇవిఎస్ఆర్.ప్రసాద్, రమేష్, వివి.రమణ, పి.శ్రీనివాసమూర్తి, నర్సారెడ్డి, రూపస్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి నారా లోకేష్ పర్యటన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. విజయవాడ నుంచి 8.10 గంటలకు విమానంలో బయలుదేరి ఉదయం 8.45 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. ఉదయం 9.30 గంటలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాలకు చేరుకుని, అక్కడ నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషిస్తారు. ఈ కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు కొనసాగుతుంది. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో నూతన భవనాలను ప్రారంభిస్తారు. 1.30 గంటలకు రాజమండ్రిలోని చెరుకూరి వీర్రాజు సుబ్బలక్ష్మి కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పార్టీ నాయకుల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుని, 5.45 గంటలకు విమానంలో బయలుదేరి, సాయంత్రం 6.15 గంటలకు విజయవాడ చేరుకుంటారు.

హడావుడిగా గుంతలు పూడ్చివేత

మంత్రి లోకేష్ పర్యటన నేపథ్యంలో ఆయన ప్రయాణించే రోడ్డు మార్గంలోని గుంతలను అధికారులు ఆఘమేఘాలపై పూడ్చివేశారు. రోడ్లపై చెత్తపోగు కూడా కనపడకుండా శుభ్రం చేశారు. మామూలు రోజుల్లో గుంతలవైపు కన్నెత్తి చూడని అధికారులు మంత్రులు వచ్చిన సమయంలో మాత్రం మసిపూసి మారేడు కాయ చేసిన పంథాలో వ్యవహరిస్తున్నారు. ప్రతి రోజూ మంత్రులు పయనిస్తే తమకు గుంతలు, పారిశుధ్య సమస్యలు తీరుతాయని ఆయా ప్రాంత ప్రజలు అంటున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన జెసి

మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో ఆర్ట్స్ కళాశాలలో చేపట్టిన ఏర్పాట్లను జెసి వై.మేఘా స్వరూప్, ప్రిన్సిపల్ రామచంద్రరావు , తదితరులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ పర్యటనకు సంబంధించిన పర్యటనను విజయవంతం చేయాలని, భద్రత, శుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ, విద్యార్థుల సమన్వయం, కార్యక్రమ స్థలాల నిర్వహణ వంటి అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అధికారులు, కళాశాల యాజమాన్యం, సిబ్బంది సమన్వయంతో పని చేసి, మంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఆయన వెంట కళాశాల అధికారులు, లెక్చరర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నన్నయ యూనివర్శిటీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి, విసి

డిసిఎం సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పెరవలి

మండలం పెరవలి జాతీయ రహదారి తణుకు రోడ్డులోని ఆర్‌కె రైస్ మిల్ ఎదురుగా ఉన్న లే అవుట్‌లో ఈ నెల 20న జరిగే ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సభను జయప్రదం చేయాలని మంత్రి దుర్గేష్, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు పిలుపునిచ్చారు. ఈ సభా ప్రాంగణాన్ని వారు గురువారం పరిశీలించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేస్తుందన్నారు రూ.3,050 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ శంకుస్థాపన చేయనున్నారన్నారు. దీని వల్ల 5 జిల్లాల్లోని 23 నియోజకవర్గాలు, ,66 మండలాల్లోని 67.82 లక్షల మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. రెండేళ్లలో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. బహిరంగ సభకు పదివేల మంది వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. వీరందరికీ భోజన సదుపాయాం ఏర్పాటు చేశామన్నారు. వారి వెంట ఆర్‌డిఒ రాణిసుస్మిత, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శ్రీనివాస్‌బాబు, బి.వెంకటగిరి, జి.త్రినాథ్ బాబు తదితరులున్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

21న జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

తూర్పుగోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషుల కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక 21న ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో జరుగుతుందని అసోసియేషన్ కార్యదర్శి బురిడి త్రిమూర్తులు తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎంపికలు జరుగుతాయన్నారు. జిల్లాలోని 19 మండలాల్లో ఉన్న కబడ్డీ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు. కబడ్డీ క్రీడాకారులు 85 కేజీలలోపు ఉండాలన్నారు. ఆధార్ కార్డును తప్పని సరిగా తీసుకురావాలన్నారు. జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 26 నుంచి 28వరకు కర్నూలు జిల్లా పంచలింగంలో జరిగే అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 98487 35152 నెంబరును సంప్రదించాలన్నారు.

20న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లులోని 33/11కెవి సబ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. చాగల్లు సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి చాగల్లు ఎంహెచ్‌ఒ ఫీడర్‌కి అడిషనల్‌గా కొత్త బ్రేకర్, ఆర్‌డిఎస్‌ఎస్ పనుల నిమిత్తం చాగల్లు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని ఫీడర్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. దీని వల్ల చాగల్లు, నేలటూరు, మీనానగరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ విద్యుత్ ఉదయం 4గంటల నుండి 9గంటల వరకు కొనసాగిస్తామన్నారు.

కౌశల్ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

భారతీయ విజ్ఞాన మండలి, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా ఆన్ లైన్ విధానంలో నిర్వహించిన కౌశల్ రాష్ట్ర స్థాయి పోటీలు-2025కు జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి అర్హత పొందిన విద్యార్థులకు బొమ్మూరు సైన్స్ సెంటర్‌లో గురువారం బహుమతి ప్రదానం చేశారు. విజేతలకు నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్, జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా కౌశల్ స్టేట్ కో ఆర్డినేటర్ మేకా సుసత్యరేఖ మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో తూర్పుగోదావరి జిల్లా కౌశల్ రిజిస్ట్రేషన్‌లో మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా జ్ఞాన భారతి నేషనల్ సెక్రెటరీ కొంపెల్లి సుబ్బరాయశాస్త్రి కౌశల్ స్టేట్ కోఆర్డినేటర్ సుసత్య రేఖను, కోఆర్డినేటర్లను అభినందించారు. ఎంపిఒ చందు మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రకాల పోటీల్లో పాల్గొనడం ద్వారా ఉన్నత స్థానానికి చేరువవుతారన్నారు. రాష్ట్ర స్థాయికి అర్హత పొందిన విద్యార్థులు ఈ నెల 27న తిరుపతిలోని సంస్కృత విశ్వ విద్యాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి కౌశల్ క్విజ్‌లో పాల్గొంటారని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కౌశల్ జిల్లా సమన్వయ కర్త సత్యనారాయణ, ఉప సమన్వయకర్త రామ్మోహన్ రావు, హెచ్‌ఎంల అసోసియేషన్ ప్రెసిడెంట్ రమణారావు, హెచ్‌ఎంలు నరసింహారెడ్డి, జాస్తిబుల్లెమ్మాయి డిగ్రీ కాలేజ్ డైరెక్టర్ వెంకట్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న కౌశల్ విజేతలతో ఉపాధ్యాయులు, నిర్వాహకులు



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

యుటిఎఫ్ గోకవరం మండలం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గోకవరం

యుటిఎఫ్ గోకవరం మండల నూతన కార్యవర్గం ఎన్నిక జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కె.నాగభూషణం, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ ఎం.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. గోకవరం ఎంపిపి మెయిన్ స్కూల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షునిగా పంతం త్రిమూర్తులు, ప్రధాన కార్యదర్శిగా పూడి ప్రసాద్, కోశాధికారిగా మద్దాల పార్థ, గౌరవ అధ్యక్షులుగా ఎస్.కుమార్, సహాధ్యక్షులుగా ఆర్.హరినాథ్, కె.విశ్వేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా కె.పావని, ఎం.సురేఖ, డి.సత్యనారాయణ, ఎస్.విశ్వనాథం, చిక్కం సతీష్‌బాబు, పి.బాలుదొర, టివివిఆర్‌ఎల్.నారాయణరావు, వల్లభ, సిహెచ్.అబ్బులురెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ఆడిటర్‌గా కె. శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన యూటీఫ్ కార్యవర్గ సభ్యులుతో ప్రమాణస్వీకారం చేశారు. యూనియన్ ఉపాధ్యాయులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

కొవ్వూరు డివైఇఒగా దిలీప్ కుమార్

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు డివిజన్ ఉప విద్యా శాఖాధికారిగా బి.దిలీప్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం అర్బన్ ఎంఇఒగా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డివైఇఒగా బాధ్యతలు స్వీకరించిన దిలీప్‌కుమార్‌ను జిల్లా విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు అభినందించారు. డిఇఒ కార్యాలయ ఎడి.వెంకట్రాజు, కొయ్యలగూడెం డివైఇఒ రామన్న దొర, కొవ్వూరు ఎంఇఒ శ్రీదేవి, హెచ్ఎం అసోసియేషన్ గౌరవాధ్యక్షులు టి.రామానుజం, సహాధ్యక్షులు కోలా సత్యనారాయణ, మంగిన శ్రీరామారావు, ఎయిడెడ్ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్షులు బి చిట్టి బాబు, డివిజన్లో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

స్వర్ణాంధ్రను సందర్శించిన సినీ నటుడు సుమన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

సినీ నటుడు సుమన్ గురువారం స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. కాకినాడలో జరిగే కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం రాజమహేంద్రవరం నుంచి వెళ్తూ లాలాచెరువులోని స్వర్ణాంధ్రకు వచ్చారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ ప్రాంగణంలో ఉన్న మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుమన్‌ను స్వర్ణాంధ్ర నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు వృద్ధులతో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఎలాంటి ప్రభుత్వ నిధులు, విదేశీ నిధులు లేకుండా ఒక స్వచ్ఛంద సేవా సంస్థను నడపడం చాలా కష్టతరమన్నారు. 1998లో స్వర్ణాంధ్ర ప్రారంభించిన సమయంలో తాను, కీర్తిశేషులు నారా రామ్మూర్తినాయుడు వ్యవస్థాపక సభ్యులుగా ఉన్నామని గుర్తు చేసుకున్నారు. అప్పటి నుంచి రాంబాబు ఆయన సర్వస్వాన్నిత్యాగం చేసి స్వర్ణాంధ్రను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా వృద్ధులతో ముచ్చటించి స్వర్ణాంధ్రలో జరుగుతున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం రామిరెడ్డి, ఎద్దు.హరికృష్ణ, స్వర్ణాంధ్ర సిబ్బంది మీరాకుమారి, దివ్య, సింధు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణాంధ్ర నిర్వాహకుడు రాంబాబుతో సినీనటుడు సుమన్

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ


జాతీయ వినియోగదారుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర లీగల్ మెట్రాలజీ శాఖ ఆదేశాల మేరకు గురువారం రాజమండ్రి పుష్కర్ ఘాట్ వద్ద గల రిలయన్స్ మార్ట్‌లో వినియోగదారులకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మోసపోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ధర్మకాటా, ఎలక్ట్రానిక్ కాటా, తూనికల రాళ్లను చూపిస్తూ వివరించారు. వస్తువులపై తయారీ తేదీ, యూజ్ బై డేట్, తయారీదారు పేరు, చిరునామా తదితర వివరాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఎక్కడైనా మోసం జరిగితే ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫుడ్ లైసెన్స్, ఐఎస్‌ఐ మార్క్, హాల్‌మార్క్ ఉన్న వస్తువులనే కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు పాల్గొని మాట్లాడుతూ వినియోగదారుల భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు.

సిఐటియు మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి- చాగల్లు

విశాఖలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ చాగల్లు పిహెచ్ పరిధిలో ఆశా వర్కర్స్ మాస్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ మేరకు ఆశా యూనియన్ రాష్ట్ర నాయకులు కె.పోశమ్మ మాట్లాడారు. డిసెంబర్ 31 నుంచి జనవరి 4వరకూ ఈ సభ జరుగుతుందన్నారు. జనవరి 4న ఆర్‌కె బీచ్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. దీన్ని జయప్రదం చేయాలన్నారు. సిఐటియు నిరంతరం కార్మిక, కర్షక, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, కార్మికుల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, కస్తూరి, మంగతాయారు, లక్ష్మి, దుర్గ, సుధ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఉత్సాహంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో మూడు రోజుల పాటు ఉత్సాహంగా జరిగిన సంసద్ ఖేల్ క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. ఎంపిడిఒ ఎం.భారతి మాట్లాడుతూ మండల స్థాయిలో వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈ నెల 19, 20 తేదీల్లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా త్వరలో పదవీ విరమణ చేయనున్న సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.మల్లికార్జునరావును అధికారులు, తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అలాగే తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ వి. భువనేశ్వరి, కోరుకొండ జోన్ ప్రెసిడెంట్ ఎడి.ప్రసాద్‌లను కూడా సన్మానించారు. ఈ ముగింపు వేడుకల్లో డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి ఎం.వెంకటరెడ్డి, గవర్నమెంట్ హైస్కూల్ హెచ్‌ఎం వీరభద్రరావు, మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎ.మల్లికార్జునరావు, కోరుకొండ మండల ప్రెసిడెంట్ ఎడి.ప్రసాద్, పీడీలు పాల్గొన్నారు.

తాళ్లపూడి : ప్రతీ విద్యార్థి చదువులో ఉత్తమ ర్యాంకులు సాధించడంతో పాటు క్రీడల్లోనూ రాణించి దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదగాలని తాళ్లపూడి ఎంపిడిఒ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలల్లో మూడు రోజులుగా జరుగుతున్న సంసద్ ఖేల్ మహోత్సవం ముగింపు సందర్భంగా అన్నదేవరపేట పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఒ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీలావణ్య, సొసైటీ అధ్యక్షులు జివి.ప్రసాద్, యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, వేగేశ్వరపురంలో కొమ్మిరెడ్డి పరశు రామారావు, నాయకులు కైగాల శ్రీనివాసరావు, మలకపల్లి లో సర్పంచ్ రాపాక రాజేశ్వరి కార్యదర్శి కామేశ్వరి ఆర్ఐ సాహిత్య తదితరులు పాల్గొన్నారు.

పెరవలి : మండలం ఖండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంసద్ ఖేల్ మహోత్సవ్ శనివారంతో ముగిసింది. మండల ప్రత్యేక అధికారి ఎం.సునీల్‌వినయ్, ఎంపిడిఒ ఉమారాజ్యలక్ష్మిపద్మజ, ఎంఇఒలు బిబిఎస్.స్వరూప్, షేక్ నూర్జహాన్, హెచ్ఎం కె.పద్మ, కెకె స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ పి.పుల్లపరాజు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. సర్వోదయ స్కూల్ అధినేత బహుమతులు అందజేశారు.

చాగల్లు : మండలం ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో నిర్వహించిన సంసద్ ఖేల్ మహోత్సవ్‌లో భాగంగా ఆటల పోటీలను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నైపుణ్యం గల విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా కారులుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విజేతలకు మెడల్స్ అందించారు. జాతీయ స్థాయి ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ పొందిన 9వ తరగతి విద్యార్థిని పైడి నందిని ఎంఎల్ఎ అభినందించారు. చదువుతో పాటు ఆటల్లోనూ ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, ఎంఇఒ సుభాకర్, ఊనగట్ల సొసైటీ అధ్యక్షులు బొల్లిన శివనాగేంద్ర, చిక్కాల సొసైటీ అధ్యక్షులు ఎండప్రగడ చిన్నఅబ్బులు, టిడిపి మండల అధ్యక్షులు చిటికెన పెంటారావు, ఉపాధ్యక్షులు బొడ్డు కేశవ, రావిపాటి కామేశ్వరరావు, నల్లూరి సుబ్బారావుశర్మ, ఉప్పులూరి శ్రీనివాస్ ప్రత్తిపాటి శశాంక్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు

వైసిపి బలోపేతానికి కృషి చేస్తా : కురుకూరి

గోపాలపురం : వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు కురుకూరి నాగేశ్వరావు తెలిపారు. రాజంపాలెంలో వైసిపి నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు శ్రీరామమూర్తి మాట్లాడారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తానేటి వనిత ఆదేశాల మేరకు రాజంపాలెం గ్రామ కమిటీ అధ్యక్షులుగా సీనియర్ నాయకులు కురుకూరి నాగేశ్వరావును నియమించినట్లు తెలిపారు. ఆయన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన గ్రామ కమిటీ అధ్యక్షులు నాగేశ్వరావు మాట్లాడారు. ఈ బాధ్యతలను అప్పగించడం పట్ల అధిష్టానానికి, మాజీ హోంమంత్రి తానేటి వనితకు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మి, వైసిపి నాయకులు ముల్లంగి శ్రీనివాస్ రెడ్డి, శాలి వేణు, కాకులపాటి శ్రీనివాస్, చాపల రమేష్‌బాబు, ఎస్‌కె.నబీ, జి.సత్యనారాయణ, షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

ప్రజాశక్తి-చాగల్లు

నిడదవోలు నుంచి పంగిడి వైపు వెళ్తున్న పాల లారీ బుధవారం రాత్రి పెండ్యాల గంటల సమయంలో వెంకట రామ థియేటర్ సెంటర్ వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎగిరి పడింది. ఈ ఘటనలో ఎవరు ఎటువంటి ప్రమాదానికి గురికాలేదని స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతు పనులు చేపట్టారు.

ప్రణాళికతో చదివితేనే విజయాలు

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం రూరల్

పరీక్షలకు సరైన ప్రణాళికతో చదివితేనే విజయాలు వస్తాయని సైకాలజిస్ట్, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ మల్లి భాస్కర్ అన్నారు. గురువారం బొమ్మూరులోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో 'పరీక్షలకు సిద్ధమవ్వడం-భవితను గెలుచుకుందాం' అనే అంశంపై ప్రత్యేక మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరీక్షలు విద్యార్థుల జీవితంలో ఒక దశ మాత్రమేనన్నారు. సరైన ప్రణాళిక, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో చదివితే ప్రతి విద్యార్థి విజయాన్ని సాధించగలరన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కెఎస్.జ్యోతి మాట్లాడుతూ గిరిజన విద్యార్థినులు విద్యను ఆయుధంగా మలుచుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు



తొండవరం హైస్కూల్లో వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న ఎంపిపి, ఎంఇఒలు

ప్రజాశక్తి - యంత్రాంగం

మండలాల్లోని పాఠశాలల్లో గురువారం వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకించారు. విజేతలకు బహుమతులు అందించారు.

అంబాజీపేట: విద్యార్థులలో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఉపకరిస్తాయని ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి అన్నారు. తొండవరం ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు కె.వెంకటేశ్వరరావు, మోకాప్రకాష్‌లు వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్రీయత, సృజనాత్మకత, సమస్య పరిష్కారాల దిశగా 7 థీమ్స్ నందు 9 ఉన్నత పాఠశాల నుంచి 63 ప్రాజెక్టులను ప్రదర్శించారన్నారు. సైన్స్ రంగోలీ అందరినీ ఆకట్టుకుంది. ప్రయివేటు పాఠశాలల నుంచి పోల్గొన్న విద్యార్థులు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్నారు. తొండవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వి.కేశవాచార్యులు కన్వీనర్‌గా వ్యవహరించగా, వివిధ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కమిటీ లను పర్యవేక్షించారు. విజేతలకు అంబాజీపేట ప్రయివేటు స్కూల్ వారు మెమెంటోలను బహూకరించారు. యాజమాన్య కమిటీ చైర్మన్ పి.సుబ్బారావు, ఎంపిటిసి సభ్యుడు దొరబాబు, ఎంపిడిఒ బి.మమత, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగర జెడిపి ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఎంఇఒ కె.తాతారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏడు అంశాల లో విద్యార్థులు ప్రథమ బహుమతి పొందారు. కార్యక్రమంలో అంగర హెచ్‌ఎం నాగరాజు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, మండలంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఆలమూరు: మండల కేంద్రంలోని బొబ్బా జయశ్రీ జెడ్‌పి బాలికోన్నత పాఠశాలలో మండల స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని మండల అభివృద్ధి అధికారి ఎ.రాజు ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఏడు రకాల సైన్స్ థీమ్ లను కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ సురేష్‌రెడ్డి, అధ్యాపకులు పరిశీలించి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ప్రకటించారు. అనంతరం జరిగిన సభలో విజేతలకు అధికారులు బహుమతి ప్రదానంచేశారు. వందన సమర్పణ గౌరీ మల్లిక్ మాస్టారు చేశారు. జిల్లాకు పంపవలసిన ఏడు థీమ్ లు వివిధ పాఠశాలల నుంచి ఎంపిక చేసి పంపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు అప్పాజీ, ఎస్.రాజు, హెచ్‌ఎం కె.ఉమ, ఎస్ఎంసి ఛైర్‌పర్సన్‌సుబ్బలక్ష్మి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల హసనబాదలో మండల వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రామచంద్రపురం డివైఇఒ పి.రామలక్ష్మణమూర్తి పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలుగా తయారవ్వాలన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఎంఇఒ బి.వీర్రాఘవరెడ్డి, వి. నాగేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సుందర్, కోఆర్డినేటర్ ఎం.సత్యనారాయణ, అబ్జర్వర్స్ కె ఎస్ఎన్.ప్రసాద్, జి.శ్రీదేవి, న్యాయ నిర్ణేతలుగా జూనియర్ కాలేజ్ లెక్చరర్స్ పాల్గొన్నారు. హసనబాద, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపేట: విద్యార్థుల్లో దాగివున్న శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని కొత్తపేట మండల విద్యాశాఖ అధికారులు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి అన్నారు. కొత్తపేట జెడిపి బాలికోన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కన్వీనర్ బండారు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శన ను వారు గురువారం ప్రారంభించారు. ఈప్రదర్శనలో మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించిన సైన్సు ప్రాజెక్టులను ఆరు టీములుగా ఏర్పాటు చేసి ప్రదర్శన నిర్వహించారు. సైన్సు ప్రదర్శనను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం జడ్పీ గర్ల్స్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు నేలపూడి సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. అనంతరం విజేతలకు మెమెంటోలు సర్టిఫికెట్లను అందజేశారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన టీములు ఈనెల 22వ తేదీన అమలాపురంలో జిల్లా స్థాయిలో జరగనున్న సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల సైన్స్ ఫెయిర్ కమిటీ సభ్యులు బండారు శేషు, ధారా శ్రీకాంత్, బొక్క నారాయణ రావు, బండారు నారాయణ, బండారు సీతారామం, హెచ్‌ఎంలు, పాఠశాల కమిటీ చైర్మన్ కుడుపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో ప్రశంసాపత్రాల అందుకున్న విజేతలు



అంగర లో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న ఎంఇఒ తాతారావు

డిఇఒను కలిసిన జివి.రావు

ప్రజాశక్తి – రామచంద్రపురం

డిఇఒ పి.నాగేశ్వరరావును బుధవారం ప్రయివేటు విద్యాసంస్థల రాష్ట్ర అధ్యక్షుడు, మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు డి.సత్తిబాబుతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను జివి.రావు డిఇఒ నాగేశ్వరరావుకి వివరించారు. ప్రయివేటు పాఠశాలల నిర్వహణ ప్రక్రియలో నియమ నిబంధనలను సరళీకృతం చేయవలసిన అవసరం ఉందని జివి.రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి తనవంతు కృషి చేస్తున్న జివి.రావు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని డిఇఒ నాగేశ్వరరావు పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఫలితాలు సాధించే దిశగా ప్రతి పాఠశాల ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఉత్తీర్ణత శాతం పరంగా జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా కషి చేయాలని కోరారు.

భీమేశ్వరాలయానికి మంగళ వాయిద్యాల బహూకరణ

ప్రజాశక్తి – రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి దేవస్థానానికి రూ. 50 వేలు విలువైన మంగళ వాయిద్యాలు దాతలు అందజేశారు. విజయవాడకు చెందిన భక్తులు కత్తి సాయికృష్ణ, రావుల రాజశేఖర్, తాతా సాంబశివరావు, వీరంకి రాజేశ్వరి, పలివెల వెంకటేశ్వరరావు, పలివెల సురేష్‌బాబు, మేడిశెట్టి భాను కిషోర్, పివి.రామిరెడ్డి, శనగశెట్టి జగదీష్ మంగళవాయిద్యాలను బహూకరించారు. వీటిని గురువారం ఆలయ అధికారులకు అందజేశారు. మంగళ వాయిద్యాలు బహూకరించిన దాతలకు దేవస్థానం అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.


స్పెల్ బి పరీక్ష నిర్వహణ

ప్రజాశక్తి – మామిడికుదురు

మొగలికుదురు హైస్కూల్ నందు గురువారం మండల స్థాయి స్పెల్‌బి టెస్ట్ నిర్వహించినట్లు హెచ్‌ఎం కెఎం.గాంధీ తెలిపారు. మండల పరిధిలో 13 హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ల నుంచి 60 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారని అన్నారు. స్పెల్ బి పరీక్ష వల్ల విద్యార్థులలో ఆంగ్ల భాషపై పట్టు పెరుగుతుందని ఎంఇఒ అన్నారు. స్పెల్లింగ్ నైపుణ్యం మెరుగుపడుతుందన్నారు ఆర్. పి. లు మల్లేశ్వరరావు మురళీకృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ పరీక్షల్లో లెవల్-3లో అప్పనపల్లి స్కూల్ నుంచి జివి.హరిషిణి విజేతగా, పాశర్లపూడి, మామిడికుదురు హైస్కూల్ల నుంచి టి. జయశ్రీ, టి.జస్మిన్, మొదటి, ద్వితీయ రన్నర్‌గా, లెవెల్ -4లో మామిడికుదురు స్కూల్ విద్యార్థులు దుర్రె షహన్వర్ విజేతగా, టి.జాన్సీ, మెయిద్ హుస్సేన్‌లు ప్రథమ, ద్వితీయ రన్నర్‌గా నిలిచారన్నారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.


కె.గంగవరం ఎస్ఐగా సోమేంద్ర

ప్రజాశక్తి – కె. గంగవరం



జి.సోమేంద్ర

కె.గంగవరం ఎస్ఐగా జి.సోమేంద్ర నియమితులయ్యారు. ఆయన మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు కె.గంగవరం ఎస్ఐగా పనిచేసిన జానీబాషా అమలాపురం విఆర్‌కు వెళ్లారు. ఎస్ఐ సోమేంద్ర ఇప్పటివరకు ట్రైనీ ఎస్ఐగా పని చేశారు. గురువారం విధుల్లో చేరిన ఆయనను పలువురు సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.



సాయి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఎంపిసి చైర్‌పర్సన్

టిడిపి జిల్లా అధ్యక్షునికి సత్కారం

ప్రజాశక్తి – ముమ్మిడివరం

జిల్లా టిడిపి అధ్యక్షునిగా ఎంపికైన గుత్తుల సాయి శ్రీనివాస్‌ను ముమ్మిడివరం మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ ఓగూరి భాగ్య శ్రీ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. మండలంలోని గాడిలంకలోని సాయి నివాసానికి ఎఎంసి ఛైర్‌పర్సన్ తో పాటు నియోజకవర్గ జనసేన నాయకులు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా భాగ్యశ్రీ మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన సాయిని ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా సాయికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుద్దటి జమ్మి, గోదశి పుండరీష్, దూడల స్వామి, కర్రా దుర్గా ప్రసాద్, మద్దింశెట్టి పురుషోత్తం, అత్తిలి బాబురావు, మోకా బాల ప్రసాద్, బద్రి రమ, చోడిశెట్టి నాగు, నూకల దుర్గ తదితరులు పాల్గొన్నారు.



నగరం ఎంపిసి సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

మార్కెట్ కమిటీల సేవల విస్తరణ

ప్రజాశక్తి – మామిడికుదురు

మార్కెట్ కమిటీల ద్వారా రైతులకు మరిన్ని ప్రయోజనకరమైన సేవలు విస్తరిస్తామని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ పెనుమాల లక్ష్మి అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే లింకు రోడ్లు నిర్మించేందుకు పంచాయతీ రాజ్ అధికారులతో మాట్లాడతానన్నారు. లింకు రోడ్ల నిర్మాణానికి రైతులు 25 శాతం వాటా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి, నగరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ ఈలి శ్రీనివాసరావు, వైస్‌ఛైర్మన్ గుడాల వెంకటరమణ, డైరెక్టర్లు కుంపట్ల మల్లికార్జునరావు, నూకల విశ్వేశ్వరరావు, పెంట ఏసు కుమారి, అడబాల నాగమణి, లూటుకుర్తి సత్యనారాయణ, పినిశెట్టి రామచంద్ర శేఖర్, చిట్టాల రామ జోగేశ్వరరావు,మార్కెట్ కమిటీ కార్యదర్శి జి.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి – అమలాపురం

జిల్లా స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ముమ్మిడివరం డిఇఒ కార్యాలయంలో డిఇఒ పి.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ నెల 22న జెడ్‌పి ఉన్నత పాఠశాల బాలురు, బాలికలు అమలాపురం నందు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఏడు థీములలో మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన ఏడు పాఠశాలల నుంచి ఒక్కో థీము నుంచి ఒక విద్యార్థి చొప్పున ప్రాజెక్టులు, అలాగే జిల్లాస్థాయిలో ఎంపికైన టీచర్ ఎగ్జిబిట్ విభాగం నుంచి 20 ప్రాజెక్టులు కలిపి మొత్తం 176 విజ్ఞాన ప్రాజెక్టులు ప్రదర్శిస్తారన్నారు. 22న మధ్యాహ్నం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు నేషనల్ మ్యాథమెటిక్స్ డే పురస్కరించుకుని గణిత ఒలింపియాడ్ గణిత అవధానం కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జివిఎస్. సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి.హను మంతరావు, మండల విద్యాశాఖ అధికారి కొండారెడ్డి, వీధి సురేష్ బాబు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఐ. పోలవరం మండలం, జి. వేమవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల నందు నిర్వహించబడింది.

ఇసుక తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి – సీతానగరం

మండలంలో ప్రతిపాదిత పేరుకుపోయిన ఇసుక తవ్వకాల ప్రక్రియపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సీతానగరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. గోదావరి నదీ తీరంలోని సీతానగరం బ్లాక్ పరిధిలో గల సర్వే నంబర్లు 218-1, 218-4, 218-1సి, 218-5లో పేరుకుపోయిన ఇసుకను తొలగించే అంశంపై స్థానికుల అభిప్రాయాలను సేకరించారు. కాలుష్య నియంత్రణ మండలి కాకినాడ ప్రాంతీయ కార్యాలయ అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇసుక నిల్వల వల్ల నదీ ప్రవాహానికి ఆటంకం కలగకుండా ఉండేందుకు, పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన

ప్రజాశక్తి – రావులపాలెం

విద్యుత్ పొదుపుపై ఆ శాఖ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం స్థానిక వాగ్దేవి పాఠశాలలో విద్యుత్ పొదుపుపై అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.చిట్టిరాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో మండల ఎలక్ట్రికల్ ఎఇ పి.నరేష్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియులకు అండగా టిడిపి

ప్రజాశక్తి – రావులపాలెం

అగ్నికుల క్షత్రియులకు ఎప్పుడూ టిడిపి అండగా ఉంటుందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు స్పష్టం చేశారు. గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయం వద్ద జిల్లా అగ్నికుల క్షత్రియ నాయకులు ఆయనను కలుసుకున్నారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ, వాడపల్లి ఆలయం వద్ద పినపోతు గజేంద్రుడు విగ్రహ ఏర్పాటు జరుగుతోందని తెలిపారు. వాడపల్లి దేవస్థానం పాలక మండలిలో అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన మసకపల్లి త్రిమూర్తులను ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించినందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పాలకమండలికి సభ్యులను ఎంపిక చేయగా, హోం మంత్రి అనిత సూచన మేరకు మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన అప్పల నరసకు సైతం స్థానం లభించిందరు. నాయకులు పాల్గొన్నారు.

పుష్కర నిధులు మంజూరు

ప్రజాశక్తి – పెరవలి

అన్నవరప్పాడు గ్రామం జాతీయ రహదారి పక్కన ఉన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణం కోసం గోదావరి పుష్కర నిధులు నుంచి రూ.2 కోట్లు మంజూరు చేసినట్టు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి మీసాల రాధాకష్ణ తెలిపారు. ఉత్తర్వులు మంత్రి దుర్గేష్ ఇచ్చారని తెలిపారు.

నేడు నన్నయ్యకు మంత్రి లోకేష్

ప్రజాశక్తి – రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో నూతనంగా నిర్మించిన భవనాలను మంత్రి నారా లోకేష్ శుక్రవారం ప్రారంభించనున్నారని విసి ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. విసితో కలిసి జెసి వై.మేఘస్వరూప్ ఈ ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. జెసి మాట్లాడుతూ మంత్రి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, అతిథుల కదలికలు, మీడియా కవరేజ్ ప్రొటోకాల్ అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శుభ్రత, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యాలు, అత్యవసర సేవలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. విసి ప్రసన్నశ్రీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ నిధుల ద్వారా మొత్తం రూ.33.80 కోట్లతో నూతన భవనాల నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. మంత్రి నారా లోకేష్ సమక్షంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, వీరి వెంట రిజిస్ట్రార్ కెవి.స్వామి తదితరులు ఉన్నారు.

కొండేపాటి కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి – చాగల్లు

చాగల్లు మండలం కలవలపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కొండేపాటి రామారావు కుటుంబాన్ని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం పరామర్శించారు. మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేవారు. ఆయన వెంట జడ్‌పిటిసి సభ్యులు గారపాటి శ్రీనివాస్, ఊనగట్ల పిఎసిఎస్ అధ్యక్షుడు బొల్లిన నాగేంద్ర, ప్రత్తిపాటి శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అవగాహనా సమావేశం

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలో చిక్కాల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలు వివిధ అంశాలపై కొవ్వూరు శక్తి టీం సభ్యులు అవగాహన కల్పించారు. శక్తి యాప్, 112 ఎమర్జెన్సీ సేవలు, ఫోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, నివారణ, సెల్ఫ్ డిఫెన్స్ వంటివాటిపై వివరించారు. అలాగే మోటార్ వెహికల్ యాక్ట్, పోక్సో యాక్ట్, డ్రగ్స్ గురించి శక్తి టీం ఎఎస్ఐ గంగాధర్‌రావు, మహిళా పోలీసులు ఎం.పద్మావతి, వరలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి – ఉండ్రాజవరం

మండలంలోని పాలంగి సబ్ స్టేషన్ పరిధి, 33/11కె వి పాలంగి, వేలివెన్ను సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణా పనుల్లో భాగంగా పాలంగి, కె.సావరం, చివటం, వేలివెన్ను, కాల్దరి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఇఇ ఎన్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలంగి, కె.సావరం, చివటం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ఒక గంట పాటు, వేలివెన్ను కాల్దరిలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు, అంతరాయం కలుగుతుందని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగుతుందన్నారు. వేలివెన్ను, కాల్దరిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి – మామిడికుదురు

హైదరాబాద్‌కు చెందిన అల్లాడి శ్రీనివాసు, మాధవి దంపతులు, వారి కుటుంబ సభ్యులు అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామిని గురవారం దర్శించుకున్నారు. దాతలు స్వామివారి అన్న ప్రసాద ట్రస్ట్‌కు రూ.11,116 విరాళంగా అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి దేవస్థానం వంశపారం పర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ(చక్రి) స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

టేబుల్ టెన్నిస్‌లో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి – అమలాపురం

విశాఖలో జరిగినరాష్ట్ర డాక్టర్స్ టేబుల్ టెన్నిస్ పోటీలలో కిమ్స్ మెడికల్ కాలేజీ విద్యార్థిని డా.నిత్యాల పెద్దిరెడ్డి మూడు విభాగాలలో బహుమతులు గెలుచుకుందని కిమ్స్ డీన్ డా.ఆనంద్ ఆచార్య తెలిపారు. గురువారం ఆమెను కిమ్స్ చైర్మన్ కెవివి.సత్యనారాయణ రాజు, కిమ్స్ ఎండి. రవి కిరణ్ వర్మ అభినందించారు.

ఒరిజినల్ క్రయ దస్తావేజు పోయినది

నా క్లయింటు బూడిద తాతబ్బాయ్ తండ్రి(లేటు) సత్యనారాయణ డోర్‌నెం.52-2-20, రాజేంద్ర నగర్, రాజమండ్రి, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నాక్లయింట్ యొక్క ఒరిజినల్ క్రయ దస్తావేజ్ **నెం.6162/2007 ది.30-4-2007,** మహేశ్వరం సబ్‌రిజిష్టర్ వారి ఆఫీసులో రిజిష్టర్ కాబడిన దస్తావేజ్ **ది.5-12-2025వ** తేదిన నా క్లయింటు రాజమండ్రి శ్యామల సెంటర్ నందు కలర్ జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా పడిపోయినది. ఎంతవెతికినను కనిపించలేదు. కనుక ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కి తెలియపర్చ వలసిందిగా కోరుచున్నాను.

ఎ.వీరభద్రరావు
అడ్వకేట్, టి.నగర్,రాజమండ్రి
సెల్.9848621000

ప్రకటన

మహారాజశ్రీ ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

EP.No.13/2022 in OS.No.103/2017

Between:-

పురోహిత్ అశోక్ కుమార్ తండ్రి రూపాజీ, వయసు 46సం॥లు డోర్‌నెం.2-2-158,ఏలేశ్వరం ...DHR

మరియు

తోటకూర నాగేశ్వరరావు తండ్రి నరసింహామూర్తి వయసు 60సం॥లు, టైర్ మెకానిక్ C/o. డిపో మేనేజర్, గోకవరం ...JDR

పై నెంబరు EP.No.13/2022 లో JDR కు DHR గారు ఎన్నిసార్లు నోటీసులు పంపినను అందుకోకుండా తిప్పి పంపించి వేయుచున్నందున శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారంగా ఈ ప్రకటన మూలముగా తెలియజేయనది ఏమనగా **ది.23-12-2025వ** తేదిన మీరు న్యాయవాది కృతముగా గాని స్వయముగా గాని పైకోర్టు వారి ఎదుట ఉదయం **10.30ని॥లకు** హాజరుగా ఉండవలయును. లేని యెడల JDR ను ఎక్స్‌పార్టీ చేసి మీ పరోక్షమున తీర్మనించెదరని తెలియజేయడమైనది.

శ్రీ ఆకుల హరిబాబు
న్యాయవాది
ప్రత్తిపాడు, సెల్.9848232845

మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.పి.నెం.4/2025

Between:-

యనమదల శ్రీను, S/o సత్యనారాయణ, Age: 42 సం॥, R/o 2-109, పినపళ్ళ గ్రామము, ఆలమూరు మండలం, కోనసీమ జిల్లా ...పిటీషనర్

మరియు

1) మేడిశెట్టి లక్ష్మి, W/o కనకం, R/o డోర్ నెం. 2-53, దివిలి గ్రామము, పెద్దాపురం మండలం

2) పడాల బాబ్జి, S/o సూర్యప్రకాశరావు, W/o 2-10/B, పెద్దిపాలెం గ్రామం, ప్రత్తిపాడు మండలం, కాకినాడ జిల్లా ... రెస్పాండెంట్స్

పై నెంబరు ఐ.పి. కేసులో పిటీషనర్, శ్రీ కోర్టువారిని ఈ ఐ.పి.లో 1వ రెస్పాండెంట్‌ని ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేస్తూ, 1 మరియు 2 రెస్పాండెంట్స్ ఐక్సాక్యూట్ చేసిన క్రియ దస్తావేజు ఈ పిటీషనరును బైండ్ చెయ్యదని, మరియు ఆ దస్తావేజు చెల్లనేరదనియు కోరుచున్నారు. సదరు వ్యవహారములో ఎవరికైన, ఏ విధమైన అభ్యంతరములు ఉన్న ఎడల, స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ **ది.22-12-2025 ఉ॥10.30 ని॥లకు** శ్రీ కోర్టువారి ముందు హాజరై ఆక్షేపణలు తెలియచేయమని, లేనిచో పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైనది.

షెడ్యూలు

కాకినాడ జిల్లా పెద్దాపురం సబ్‌డివిజను, పెద్దాపురం మండలము, దివిలి గ్రామము, ఖాళీ స్థలము సర్వేనెం.97, విస్తీర్ణము 144 చ॥గ॥(లేదా) 120/96 చ॥మీ॥ మరియు బంగళా టైల్సు ఇల్లు డోర్‌నెం.2-53, అసెస్మెంట్ నెం.178 ఈ దిగువ సరిహద్దుల మధ్యస్థమైయున్నది.

తూర్పు : 24 అడుగుల మెయిన్ రోడ్డు, **దక్షిణం:** 54 అడుగుల కటకం రాంబాబుకి చెందిన కొట్లు **పడమర:** 24 అడుగుల ఖాళీస్థలం, **ఉత్తరం** : 54 అడుగుల కాళ్ళ వెంకటరమణ గారి ఇల్లు

N.V.S.Murthy(Balu)
Advocate, Peddapuram
Cell.9394711830

యుటిఎఫ్ సీతానగరం మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి – సీతానగరం

యుటిఎఫ్ సీతానగరం మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోటవరం సంజీవపురం పాఠశాలలో నిర్వహించిన ఈ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షునిగా ఆర్.పాపారావు, ప్రధాన కార్యదర్శిగా పి.సత్తిబాబు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియకు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ ఎన్నికల అధికారిగా, జిల్లా కార్యదర్శి ఇ.శ్రీమణి పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడారు. ప్రస్తుత కాలంలో ఉపాధ్యాయులపై తీవ్రమైన పని ఒత్తిడి పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బోధనకంటే ఉపాధ్యాయులకు బోధనేతర పనులతోనే సరిపోతుందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం సంఘం పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మరో నేత ఇ.శ్రీమణి మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణ విధానాల్లో మార్పులు రావాలని, సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. గౌరవాధ్యక్షులుగా ఎం.పోనయ్య, సహాధ్యక్షులుగా కె.నాగేశ్వరరావు, కె.విజయలక్ష్మి, కోశాధికారిగా ఎం.ఎ.రాజు, కార్యదర్శులుగా ఎంవి.రఘు, ఎవి.శ్రీనివాసరావు, పి.జ్యోతిర్మయి, కెఆర్‌ఎ.రామకృష్ణ, బి.సత్యనారాయణ, కె.గంగాధర్, ఎం.సాంబశివరావు, వి.వెంకటేశ్వరరావు, యు.వీరబాబు, మరో తొమ్మిది మంది జిల్లా కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, మండలంలోని ఉపాధ్యాయులు, యుటిఎఫ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

600 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి – తాళ్లపూడి

తాళ్లపూడిలోని శ్రీ సాయిస్ఫూర్తి ఆసుపత్రిలో నిర్వహించిన శిబిరంలో 600 మంది విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత, కంటి వైద్య పరీక్షలు, చిన్నపిల్లలు ఎదుర్కొంటున్న పీడియాట్రిక్, గైనిక్, సర్జరీ విభాగాలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆసుపత్రి సిఇఒ సుధీర్ మాట్లాడుతూ శుక్ర, శనివారాల్లో కూడా ఈ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. డాక్టర్ శాంతి, డాక్టర్ సాగర్, డాక్టర్ జగదీష్, డాక్టర్ రామారావు, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ మౌనిక, డాక్టర్ రేణుక, డాక్టర్ శ్రీరామ్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు.

బాబి మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి – పెరవలి

మండలంలోని అన్నవరప్పాడులో జిల్లా సీనియర్ నాయకుడు రంగినీడి గంగాధరరావు కుమారుడు బాబి మతి చెందాడు. ఆయన మృతికి మంత్రి దుర్గేష్, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, నాయకులు పివిఎస్.వర్మ, నాయకులు పొప్పొప్పు సూర్య నాగేశ్వరరావు, పొప్పొప్పు వెంకటనాగేశ్వరరావు, అతికాల శ్రీను, పి.రవికుమార్, ఎస్.సత్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 248/2022

Between :

అడపా నాగబాబు ...వాది

మరియు

బుద్దాల వీర వెంకటరమణ ...ప్రతివాది

To - ప్రతివాది:

బుద్దాల వీర వెంకటరమణ,
S/o. నూకరాజు, వయస్సు 66 సంవత్సరాలు, వ్యవసాయం మరియు వ్యాపారం, డోర్.నెంబర్: 3-36, తిరుపతి, పెద్దాపురం మండలం.

పై నెంబరు దావాలో, మీరు ప్రతివాది అయి ఉన్నారు. పై నెంబరు దావాలో కోర్ట్ వారు మీకు ఎన్ని సార్లు సమన్లు పంపినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు శ్రీ కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమయినది. పై నెంబరు దావా పై మీకు ఎటువంటి అభ్యంతరములు వున్నా స్వయంగా కాని, ప్లీడరు గారి ద్వారా గాని **ది.29-12-2025 తేదీన ఉదయం గం.10.30 ని॥లకు** పై కోర్ట్ వారి ఎదుట హాజరు అయి తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమున దావాను కోర్ట్ వారు తీర్మానించుదురని తెలియజేయడమయినది.

దేవులపల్లి V.N.S. సూర్యప్రకాశ రావు,
శ్రీమతి B. (D) ఉమాదేవి, న్యాయవాదులు,
డోర్.నెం.2-8-12/7, రామారావు పేట,
పెద్దాపురం, సెల్: 9392815822

ప్రకటన

మహారాజశ్రీ 12వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, పిఠాపురం, తూర్పుగోదావరి జిల్లా

AS No.33/2022

Between:

Kothum Satish ...Appellant

and

Kuppuswami Palani Sankhar,
S/o. Palani, aged 70 years, D.No. 7-52, Poultry Farm Colony, H/o. Kothuru, Tuni Mandal.
...1st Respondent

పై నంబరు వాజ్యములో మీరు ఒకటవ రెస్పాండెంటు అయి ఉన్నారు. మీకు కోర్టు నుండి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను, ఉద్దేశ్యపూర్వకంగా నోటీసులు తీసుకోనకుండా కాలయాపన చేస్తున్న కారణంగా, కోర్టు వారి అనుమతితో ప్రత్యామ్నాయ పద్ధతి అయిన ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా సదరు దావా మీ హాజరు నిమిత్తం ది.20-01-2026వ తేదిన వాయిదా అయి ఉన్నది. కావున ఇందుమూలంగా ఒకటవ ప్రతివాది అయిన మీకు తెలియచేయునది ఏమనగా వాయిదా తేది అయిన **ది.20-01-2026వ తేదిన ఉదయం 10.30 లకు** పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో వ్యక్తిగతంగా గాని, లేదా వకీలు ద్వారా గాని హాజరై అభ్యంతరములు ఉంటే తెలియజేసుకొనవలెను. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

//శ్రీ కోర్టు వారి అనుమతితో//

పడాల రవి, అడ్వకేట్
పిఠాపురం
ది.18-12-2025 పిఠాపురం, సెల్: 9848011614

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 985/2024

Between:

Karri Sridhar Rao ***...Plaintiff***

AND

Smt. Kapileswaram Santhi Kumari and Others ***...Defendants***

D-4: Vasimsetty Srinu, S/o. Vasamsetty Bhushanam, aged 45 years, Opp: Sainagar Kanakadurgamma Temple, Morampudi to Hukumpeta Road, Rajamahendravaram, E.G.Dist.,

...4th Defendant

పై నెంబరు దావాలో 4వ డిఫెండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 22-12-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కొవ్విడి వెంకటరావు
రాజమండ్రి అడ్వకేట్, రాజమండ్రి
17-12-2025 సెల్:9440234625

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

I.A. No. 1952/2024 in **O.S. No. 985/2024**

Between:

Karri Sridhar Rao ***...Petitioner/ Plaintiff***

AND

Smt. Kapileswaram Santhi Kumari and Others ***...Respondents/ Defendants***

2: Chitturi Veerababu, S/o. Chitturi Satyanaraana, aged 40 years, Opp: Sainagar Kanakadurgamma Temple, Morampudi to Hukumpeta Road, Rajamahendravaram, E.G.Dist.,

D-4: Vasimsetty Srinu, S/o. Vasamsetty Bhushanam, aged 45 years, Opp: Sainagar Kanakadurgamma Temple, Morampudi to Hukumpeta Road, Rajamahendravaram, E.G.Dist.,

...2, 4 Respondents/ Defendants

పై నెంబరు గ్రంథంలో 2, 4 రెస్పాండెంట్లు/ డిఫెండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 22-12-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై గ్రంథంలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు గ్రంథంను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కొవ్విడి వెంకటరావు
రాజమండ్రి అడ్వకేట్, రాజమండ్రి
17-12-2025 సెల్:9440234625